సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం ၊ 15 ၊ నవంబర్ ၊ 2024



ఎందుకీ కక్ష..?

సంచార వైద్యసేవలపై ప్రభుత్వం కక్ష చూపుతోంది. ఉద్యోగులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

- 8లో



స్పోర్ట్స్‌మీట్ ప్రారంభం

ఎచ్చెర్ల గురుకుల విద్యాలయంలో జోనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. మూడు రోజులు పోటీలు జరుగుతాయి.

- 8లో

నేడు స్వాభిమాన్ వినతుల స్వీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్ జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం పది గంటలకు విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్ స్వాభిమాన్ కార్యక్రమం జరుగుతుందని విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కె.కవిత పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలో ఉన్న విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

అరసవల్లి: శ్రీకాకుళం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 11 కేవీ ఫీడర్ల మరమ్మతు, నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లుగా ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావు ప్రకటనలో తెలియజేశారు. ఈమేరకు కనుగులవానిపేట సబ్‌స్టేషన్ పరిధిలో కనుగులవానిపేట, కళ్లేపల్లి, ఇప్పిలి, చల్లపేట సబ్‌స్టేషన్ పరిధిలో చల్లపేట, శ్రీకూర్మం, ధర్మవరం సబ్‌స్టేషన్ పరిధిలో ముద్దాడ, లోలుగు (పొందూరు) సబ్‌స్టేషన్ పరిధిలో లోలుగు, జి.సిగడాం సబ్‌స్టేషన్ పరిధిలో అన్ని ప్రాంతాలు, రణస్థలం సబ్‌స్టేషన్ పరిధిలో రణస్థలం, నెలివాడ, లావేరు మండలం లావేటిపాలెం, శ్రీకాకుళం నగరం హడ్కోకాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లుగా ఆయన ప్రకటించారు.

బిర్సా ముండా జయంతి ఏర్పాట్ల పరిశీలన



మెళియాపుట్టి ఏకలవ్య పాఠశాలలో అధికారులతో మాట్లాడుతున్న సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల భవన సముదాయాల్లో స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండా జయంతిని ఈ నెల 15న నిర్వహించనున్నట్లు సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఏకలవ్య పాఠశాలలో జరుగుతున్న ఏర్పాట్లను, టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తితో కలిసి పరిశీలించారు. అన్ని శాఖల అధికారులతో మాట్లాడుతూ స్టాల్స్‌ను అన్ని శాఖల నుంచి ఏర్పాటు చేయాలని అన్నారు. ఆయనతో పాటు ఈఈ రమాదేవి, డీఈ సిమ్మన్న, ఏఈ శ్రీకాంత్, ఐటీడీఏ పీహెచ్ఓ గణేష్, ఎంపీడీఓ నరసింహ ప్రసాద్ పండా, తహసీల్దార్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్పులకు సంబంధించి కొత్తవారు, రెన్యువల్ చేసుకునేవారు రిజిస్ట్రేషన్ ప్రక్రియను నవంబర్ 30 లోగా పూర్తిచేయాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి విశ్వమోహన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను కళాశాలలో చదువుతున్న వారిలో పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలకు అర్హత గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ కళాశాల యాజమాన్యంతో సంప్రదించి జ్ఞానభూమి వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. విద్యార్థులకు ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత కళాశాలలో, స్థానిక సచివాలయంలో లేదా సంక్షేమ శాఖల కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కొత్త రిజిస్ట్రేషన్ మరియు రెన్యువల్ చేయడానికి సేవలను http:jnana bhumi.apcfrr.in వెబ్ పోర్టల్ కళాశాల లాగిన్ లో పొందుపరచాలని తెలిపారు.

నల్ల చట్టాలు రద్దు చేయాలని 26న ధర్నా



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని కోరుతూ నవంబర్ 26వ తేదీన దేశవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద నిర్వహించే ధర్నాలో రైతులు పాల్గొనాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతు,కార్మిక సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో శ్రీకాకుళం సీపీఎం కార్యాలయంలో తాండ్ర ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడారు. ఆనాడు ఢిల్లీ నడిబొడ్డున పదమూడు నెలల కాలం పాటు జరిగిన రైతుల ఉద్యమాన్ని నీరుగార్చిన నరేంద్ర మోదీ.. అప్పట్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదన్నారు. దీన్ని నిరసిస్తూ 26వ తేదీన దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ఆందోళనలో పెద్ద ఎత్తున రైతు కార్మిక అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కోనారి మోహనరావు, చాపర వేణుగోపాల్, పేకల తేజేశ్వరరావు (సిఐటియు), అమ్మన్న నాయుడు,సురేష్,యుగంధర్ (ఎ ఐ వై ఎఫ్) పోలాకి ప్రసాద్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





ఒక చిన్న మ్యూజికల్ చైర్ గేమ్ ఆడుతూ ఆ పిల్లలు సంబరపడిపోయారు. టగ్ ఆఫ్ వార్‌లో నెగ్గితే ప్రపంచాన్నే గెలిచినంత సంతోషపడిపోయారు. పరుగు పందాల్లో అయితే అన్నీ మర్చిపోయి ఆనందంగా పరుగులు పెట్టారు. పాట పాడమంటే గొంతుతో కాదు.. గుండెతో పాడారు. దేవుడు పెట్టిన లోపాన్ని ఒక నవ్వుతో దాచేశారు. తాము విశ్వప్రేమకు వారసులమని చాటి చెప్పారు. జిల్లా కేంద్రంలోని బెహరా మనోవికాస కేంద్రంలో 'సాక్షి' ఆధ్వర్యంలో జరిగిన బాలల దినోత్సవం ప్రత్యేక అవసరాల పిల్లల్లో ఆనందం నింపింది. వారిలోని ప్రతిభను ప్రదర్శించేందుకు ఓ వేదికనిచ్చింది.



విశ్వప్రేమకు వారసులం

బెహరా మనోవికాస కేంద్రంలో 'సాక్షి' బాలల దినోత్సవం

- ఆటపాటలతో మురిసిన ప్రాంగణం
- ఆద్యంతం అల్లరి చేస్తూ సందడి చేసిన ప్రత్యేక అవసరాల పిల్లలు



జాతీయస్థాయి డిజేబుల్డ్ ఒలింపిక్ గేమ్స్‌లో మూడో స్థానంలో నిలిచిన వసుంధర

ఉరిమే ఉత్సాహంతో పరుగు

శ్రీకాకుళం కల్చరల్:

జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ప్రత్యేక అవసరాల చిన్నారులకు చెందిన బెహరా మనోవికాస కేంద్రం చిన్నారులతో 'సాక్షి' ఆధ్వర్యంలో చిల్డ్రన్ లాఫింగ్ క్లబ్ సహకారంతో బాలల దినోత్సవాలు గురువారం నిర్వహించారు. చిన్నారులంతా ఉత్సాహంగా పాల్గొని వారిలో ఉన్న ప్రతిభను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ వివేకానంద నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో లాఫింగ్ క్లబ్ వ్యవస్థాపకులు లోకనాథం నందికేశ్వరరావు, లయన్స్ క్లబ్ ప్రతినిధి నటుకుల మోహన్ లాఫింగ్ క్లబ్ సభ్యులు బీఎంఎస్ పట్నాయిక్, నిక్కు హరిసత్యనారాయణ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డీఎస్పీ వివేకానంద

'సాక్షి' చొరవ స్ఫూర్తిదాయకం



'సాక్షి' తీసుకున్న చొరవ స్ఫూర్తిదాయకం. ఇలాంటి చిన్నారులకు సేవ చేయడం ఎంతో గొప్ప విషయం. – వివేకానంద, డీఎస్పీ

ఇలాంటి చిన్నారులను గుర్తించాలి



మానసిక దివ్యాంగులను 'సాక్షి' గుర్తించడం ఎంతో గొప్ప విషయం. నెహ్రూకు చిన్నారులంటే ఎంతో ప్రీతి. అందుకే ఈ రోజు బాలల దినోత్సవం నిర్వహిస్తున్నాం. – ఎల్.నందికేశ్వరరావు, లాఫింగ్ క్లబ్ వ్యవస్థాపకులు

మమ్మల్ని భాగస్వామ్యం చేయడం ఆనందం



ఇలాంటి కార్యక్రమంలో మమ్మల్ని భాగస్వాములు చేసినందుకు 'సాక్షి'కి ధన్యవాదాలు. మానసిక దివ్యాంగులతో బాలల దినోత్సవం చేసేందుకు ముందుకు రావడం ముదావహం. వీరికి ఆటపాటల్లో కూడా శిక్షణ ఇచ్చి ఆడించడం గొప్ప విషయం.

– నటుకుల మోహన్, లయన్స్ మెంటార్, లాఫింగ్ క్లబ్ ప్రతినిధి





స్కిప్పింగ్



నెహ్రూ చిత్రపటానికి గులాబీలు పెడుతున్న విభిన్న ప్రతిభావంతులు

విజేతలు వీరే..

రన్నింగ్ సీనియర్ మొదటి విభాగంలో గోపి, శ్రీతేజ, హరి, రెండో విభాగంలో ఆర్.రాజేష్, విజయకుమార్, సందీప్‌నాయుడులు గెలుపొందారు. మూడో బ్యాచ్‌లో పి.గణేష్, నిక్కిలు గెలుపొందారు. రన్నింగ్ జూనియర్స్‌లో మొదటి విభాగంలో మోహిత్‌సాయి, రోషన్, రన్నింగ్ రెండో విభాగంలో చైతన్య, రాజ్‌కుమార్ గెలుపొందారు. మ్యూజికల్ చైర్స్ ఆటలో సీనియర్స్‌లో గోపి, సాయితేజ, సాయికృష్ణ, జూనియర్స్‌లో జయచంద్ర, మోక్షిత్‌సాయిలు గెలుపొందారు. బెలూన్స్ పోటీలో మోక్షిత్ సాయి, షణ్ముఖశ్రీనివాస్, టగ్ ఆఫ్ వార్‌లో గోపాల్, గోపి మిశ్రా, విజయకుమార్ గెలుపొందారు. పాటల పోటీలో రోహిణి, రేవతి, వెంకటలక్ష్మి గెలిచారు. స్కిప్పింగ్‌లో వసుంధర, రేవతి విజేతలుగా నిలిచారు. వీరికి బహుమతులు అందజేశారు.



టగ్ ఆఫ్ వార్ ఆడుతూ..



బహుమతులు అందిస్తున్న డీఎస్పీ వివేకానంద





'సాక్షి' మా చిన్నారులను గుర్తించింది



మానసికంగా ఎదగలేని చిన్నారుల కోసం 'సాక్షి' బాలల దినోత్సవం ఎంతో చక్కగా నిర్వహించడం ఆనంద దాయకం. అందుకు సహకరించిన లాఫింగ్‌క్లబ్ ప్రతినిధులకు ధన్యవాదాలు.

– శ్యామల, కేంద్రం నిర్వాహకురాలు



ఆనందంగా డ్యాన్స్ చేస్తున్న పిల్లలు

17న హమాలీల జిల్లా మహాసభలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీకాకుళంలో జట్టు కళాసీ హమాలీ ఫెడరేషన్ (సీఐటీయు) జిల్లా మహాసభలు 17న నిర్వహించనున్నామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, కళాసీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిన్నారావు, కె.సూరయ్య పిలుపునిచ్చారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కళాసీ సంఘం జిల్లా మహాసభలు పోస్టర్లను ఆవిష్కరించారు. హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చిల్లి గవ్వ కూడా ముఠా కార్మికుల సంక్షేమానికి కేటాయించడం లేదని అన్నారు.

ప్రకృతి వ్యవసాయం పెరగాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణాన్ని పెంచాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లాలో పంటల సాగు, ఆదాయం మరింత పెరగాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఆర్గానిక్ ఉత్పత్తుల అమ్మకాలకు సర్టిఫికేషన్ అవసరమన్నారు. కలెక్టర్ సంబంధిత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో ఉత్పత్తుల ప్యాకింగ్‌పై ఆరా తీశారు. ఆర్ట్స్ సంస్థ ప్రతినిధి సన్యాసిరావు ప్యాకింగ్ విధానంపై వివరించారు. ఆర్గానిక్ ఉత్పత్తుల అమ్మకానికి మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడైనా స్థలాన్ని కేటాయించాలని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కోరగా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి సంబంధిత ఏర్పాట్లు చేయాలని, అలాగే మెప్మా మార్ట్‌లో ఆర్గానిక్ ఉత్పత్తులపై ఒక ర్యాక్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారికి ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వరప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథ స్వామి, మార్కెటింగ్ సహాయ సంచాలకులు బి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్‌మీడియా కార్యకర్తలకు అండగా ఉంటాం



సీదిరి అప్పలరాజు



శ్యామ్‌ప్రసాద్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అక్రమ నిర్బంధాలు, అరెస్టులకు గురవుతున్న సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ అంశానికి సంబంధించి పార్టీ తరఫున ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తామన్నారు. శ్రీకాకుళం జిల్లా బృందంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, శ్యామ్‌ప్రసాద్‌లను నియమించారు.

ఆస్తి పన్ను వంద శాతం వసూలు చేయాల్సిందే



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆస్తి పన్ను 100 శాతం వసూలు చేయాల్సిందేనని మున్సిపల్ అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఇచ్ఛాపురం, పలాస – కాశీబుగ్గ, ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్లు, ఇతర సిబ్బందితో కలెక్టర్ కార్యాలయం నుంచి గురువారం సాయంత్రం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపాలిటీలు ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను వెతకాలని స్పష్టం చేశారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీ స్థలాల పన్ను రూ.5.71 కోట్లు వసూలు చేయాల్సి ఉందని, సంబంధిత అధికారుల జీతాలను అటాచ్ చేస్తామని హెచ్చరించారు. చాలా మున్సిపాలిటీలు ప్రకటనల పన్నులను వసూలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి పన్ను వసూలు చేయడంలోనూ ఉదాసీనత పనికిరాదన్నారు. ఇచ్ఛాపురంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారికి గుడ్ విల్ కింద పన్నులు వసూలు చేయాలని చెప్పారు. పలాస-కాశీబుగ్గలో అందుబాటులో ఉన్న మున్సిపాలిటీకి చెందిన నాలుగు ఎకరాల ఖాళీ స్థలంలో పెద్ద షాపింగ్ కాంప్లెక్స్, కల్యాణ మండపం నిర్మించడానికి ప్రతిపాదనలు రూపొందించాలని చెప్పారు. శ్రీకాకుళం నగరంలోని విజయాదిత్య పార్కులో ప్రకటనల కోసం పెద్ద పెద్ద హోర్డింగ్‌లు ఏర్పాటు చేసుకునేందుకు కార్పొరేట్ సంస్థలకు అవకాశం కల్పించాలని, వారి నుంచి లీజుతో పాటు ప్రకటనల పన్ను వసూలు చేయాలని చెప్పారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణలో కచ్చితత్వం పాటించి, చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలకు పంపించాలన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ నుంచి శ్రీకాకుళం డంపింగ్ యార్డ్‌కు చెత్తను తరలించాలన్నారు.

పని పెంచారు.. జీతం మరిచారు



- ఐదు నెలలుగా జీతాల్లేక ఇబ్బంది పడుతున్న వీఓఏలు, ఆర్పీలు
- ఆందోళనకు సిద్ధమవుతున్న ఉద్యోగులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహిళా సాధికారత కోసం నిరంతరం పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందిపై కూటమి ప్రభుత్వం శీతకన్ను వేస్తోంది. వారికి ప్రతి నెల గౌరవ వేతనం చెల్లించకుండా పనిభారం పెంచుతోంది. ఒక పక్క రాజకీయ వేధింపులు, మరో వైపు పెరుగుతున్న పనిభారంతో వీరు అవస్థలు పడుతున్నారు. వీరికి ఇప్పటికే ఐదు నెలల జీతాలు ఇవ్వాల్సి ఉంది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ–వెలుగు సంస్థలో గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలను ఆర్థికంగా తీర్చిదిద్దే గ్రామ స్థాయి ఉద్యోగులైన సీఎఫ్(వీఓఏ), పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలో వార్డుల పరిధిలో పనిచేసే ఆర్పీలకు పనిభారం విపరీతంగా పెరిగింది. గతంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నిర్వహించిన పనులన్నీ ఇప్పుడు వీరికే అప్పగిస్తున్నారు. దీంతో వారికి ఈ పనులన్నీ చేయడం తలకుమించిన భారమవుతోంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని డీఆర్‌డీఏలోని 30 మండలాల పరిధిలో 1224 మంది సీఎఫ్‌లు ఉన్నారు. మెప్మా పరిధిలో శ్రీకాకుళం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస, ఇచ్ఛాపురం పురపాలక సంఘాల పరిధిలో ఆర్పీలు 48 మంది ఉన్నారు. వీరంతా జీతాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా గ్రామ సంఘాల నిర్వహణ, సమావేశాలు నిర్వహించడం, వారికి సూచనలు సలహాలు అందజేయడం, ప్రతి నెల రెండు పర్యాయాలు సంఘాలకు వివరాలతో బుక్‌కీపింగ్, సంఘాలకు బ్యాంకు రుణాలు (లింకేజీలు) అందజేయడం, స్త్రీనిధి రుణాలు అందజేయడం రుణాలు రికవరీ వంటివి వీరి పనులు. దీనికి తోడుగా మహిళా సంఘాల పనులతో పాటు జాతీయ సర్వేలు కూడా ఈ సంఘాలకు అంటగట్టారు. ఎస్ఆర్‌హెచ్ఎం పాలసీలో భాగంగా లైవ్‌లీహుడ్ కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యక్రమాల అమలు, నిర్వహణ, పర్యవేక్షణ, బాల ఆరోగ్య పథకం పర్యవేక్షణ, వయోజనుల స్థితిగతులు తెలియజేయడం, వయోజన విద్యా భారం, లోకాస్ యాప్, లక్క పతి వంటి యాప్‌లో సమాచారం అప్‌లోడ్ చేయడం, ఇంటింటా సర్వేలు చేయడం వంటి పనులన్నీ వీరికే చెబుతున్నారు.

ఆందోళనకు సిద్ధం

వెలుగు కింది స్థాయి సిబ్బందిపై ఎక్కువ భారం మోపుతుండడంతో వీరికి విసుగు పుడుతోంది. దీంతో వారు యూనియన్‌గా ఏర్పడి ప్రభుత్వ విధానాలపై ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

శ్రీముఖలింగంలో బాలి యాత్రకు ముమ్మర ఏర్పాట్లు



బాలి యాత్రపై నిర్వాహక కమిటీ సమాలోచన

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం వంశధార నదీ తీరాన ఈనెల 17న బాలియాత్ర నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు గురువారం నిర్వాహక కమిటీ ప్రతినిధులు టెక్కలి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పేరాడ తిలక్, వైద్యులు జీవితేశ్వరరావు, నందిగాం ఎంపీపీ శ్రీరాములు అర్చకులు, భక్తులతో శ్రీముఖలింగంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీనికి ముందు బాలి యాత్ర వంశధార నదిలో నిర్వహించే ఘాట్‌లను పరిశీలించారు. కార్తీక పౌర్ణమి మరునటి రోజున వంశధార నదిలో దీపాలు విడిచిపెట్టి ఉత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వేల ఏళ్ల కిందట కళింగ రాజ్యంలోని బాలి అనే దీవికి వెళ్లి దీపాలు విడిచిపెట్టేవారని దీంతో వారి నౌకా వ్యాపారం విజయవంతంగా జరిగి మంచి లాభాలతో తిరిగి వచ్చేవారని చరిత్ర వివరిస్తుంది. ఆ సంప్రదాయాన్ని కొనసాగించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.సతీష్ కుమార్, ఎంపీటీసీ సభ్యులు కె.హరి ప్రసాద్, అల్లాడ పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు ఎం. శ్యామలరావు, అర్చకులు కొండయ్య,నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్పెషల్ బీఈడీ మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో నిర్వహిస్తున్న స్పెషల్ బీఈడీ (మెంటల్లీ రిటార్డ్) కోర్సుల్లో మిగులు సీట్లుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అనూరాధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఈ నెల 18వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకో వచ్చని పేర్కొన్నారు. ఎడ్‌సెట్ -2024 ర్యాంకు తప్పనిసరని, ర్యాంకు మెరిట్, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లకు ప్రభుత్వ రాయితీలు వర్తించవని స్పష్టం చేశారు.

మధ్యాహ్న భోజనంపై ఆరా



భోజనం రుచి చూస్తున్న ఆర్డీఓ కృష్ణమూర్తి

మెళియాపుట్టి: మండల కేంద్రం మెళియాపుట్టి లోని కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లను టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి గురువారం తనిఖీ చేశారు. హైస్కూల్లో కొందరు విద్యార్థులు ఇంటి నుంచి క్యారేజీలు తీసుకువస్తున్నట్లు గుర్తించి విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. దీంతో వారు స్పందిస్తూ కార్తీకమాసం కావడంతో క్యారేజీలు తీసుకువస్తున్నారని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. మధ్యాహ్న భోజనం గ్యాస్ వినియోగించే వండాలని కార్మికులను సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పాపారావు, కేజీబీవీ ఎస్‌ఓ రమ్య, హెచ్‌ఎం గణపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



తల్లీబిడ్డలతో 108 సిబ్బంది

కాశీబుగ్గ: మందస మండలం కుదుమాసాయి గ్రామానికి చెందిన సవర విజయలక్ష్మి (21) అనే నిండు గర్భిణికి బుధవారం అర్ధరాత్రి పురిటినొప్పులు రావడంతో పలాస 108 సిబ్బంది వెంటనే స్పందించారు. సకాలంలో గ్రామానికి చేరుకొని గర్భిణిని అంబులెన్స్‌లో తీసుకొస్తుండగా మార్గమధ్యలో రెంటికోట సమీపంలో ప్రసవం జరిగి పండంటి పాపకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను క్షేమంగా పలాస ఆస్పత్రిలో చేర్పించారు. 108 సిబ్బంది పాసాల సత్యం, కెల్లి శ్రీనివాసరావు, ఆశ కార్యకర్త మేరితో పాటు ఫోన్‌లో సలహాలు అందించిన డాక్టర్ గాయత్రిలను పలువురు అభినందించారు.



104 వాహనాలు

సంచార వైద్యసేవలపై..
ఎందుకీ కక్ష?

- 104 వాహన సిబ్బందిపై సర్కారు చిన్నచూపు
- జీతాలు చెల్లించకుండా.. ఉద్యోగ భద్రత లేకుండా వేధింపులు
- ప్రభుత్వ తీరుపై నిరసనలు కొనసాగిస్తున్న 104 సిబ్బంది
- ఇకపై డైలీ రిపోర్టులు ప్రభుత్వానికి పంపకూడదని నిర్ణయం
- అధికారిక వాట్సాప్‌ల నుంచి కూడా ఎగ్జిట్

అరసవల్లి:

గ్రామీణ ప్రాంతాలకు మొబైల్ యూనిట్లుగా వెళ్లి ప్రత్యక్ష వైద్య సేవలను అందిస్తున్న 104 వాహనాలపై కూటమి సర్కారు కన్నెర్ర చేస్తోంది. నడవలేని, ఊరు దాటలేని వారికోసం షెడ్యూల్ ప్రకారం ఒక్కో గ్రామంలోకి వెళ్లి అక్కడే వారికి బీపీ, షుగర్ పరీక్షలతో పాటు దీర్ఘ కాలిక వ్యాధులకు సైతం మందులను ఉచితంగా ఇచ్చేలా ఈ మొబైల్ వాహనాలు పనిచేస్తున్నాయి. ఇందులో పనిచేస్తున్న డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు (డీఈఓ) తదితర ఉద్యోగులకు నాలుగు నెలల నుంచి జీతాలు చెల్లించడం లేదు. వాహనాలకు అనుబంధంగా పనిచేస్తున్న వైద్యులకు, ల్యాబ్ టెక్నీషియన్లను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించిన ప్రభుత్వం తమను కూడా కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా 125 మంది సిబ్బంది 14 రోజులుగా జిల్లా వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎక్కడా తమ బాధ్యతలను తప్పకుండా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందిస్తూనే నిరసనను కొనసాగిస్తున్నారు. నిరసనలకు సంబంధించి గత నెలాఖరున జిల్లా వైద్యారోగ్య శాఖాధికారికి నోటీసులిచ్చిన 104 ఉద్యోగుల సంఘ ప్రతినిధులు.. ఇటీవలే జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ వద్ద ధర్నాకు సైతం దిగారు.

జీతాల్లేవ్.. భద్రతా లేదు!

జిల్లాలో 104 సర్వీసు వాహనాలు మొత్తం 52 ఉన్నాయి. ఇవన్నీ అరబిందో యాజమాన్యం ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. వాహనాలకు డీజిల్, పెట్రోల్, మందులను ఈ సంస్థే అందజేస్తోంది. సిబ్బంది జీతాలను మాత్రం ప్రభుత్వమే భరించాల్సి ఉంది. అయితే కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంతవరకు 104 సిబ్బందికి జీతాలు చెల్లించలేదు. మరోవైపు అరబిందో యాజమాన్యానికి బెదిరింపులకు గురిచేస్తూ సంస్థ సర్వీస్‌లను నిలిపివేసేలా ప్రణాళికలు అమలు చేస్తోంది. అయితే సంస్థ మారినా.. మారకపోయినా తమ జీతాలను ప్రభుత్వమే ఇవ్వాల్సి ఉందని, ఈ చర్యలను కూడా కూటమి సర్కార్ పక్కన పెట్టేసి పస్తులుంచుతోందని సిబ్బంది వాపోతున్నారు.

ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి..



104 వాహనాలను సర్వీస్ ప్రొవైడర్లకు ఇవ్వడం వల్ల ఒక్కో వాహనానికి నెలకు రూ.1.50 లక్షలు ఖర్చు అవుతోంది. ప్రభుత్వమే నేరుగా నిర్వహిస్తే రూ.50 వేలు సరిపోతుంది. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ఉండాలంటే ప్రభుత్వమే 104 సర్వీస్‌లను నిర్వహించాలి. జీతాల చెల్లింపు, కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలనే డిమాండ్లు తక్షణమే నెరవేర్చాలి.

– చల్లా నారాయణ, జిల్లా 104 ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు

ఉద్యోగ భద్రత కల్పించాలి..



జిల్లాలో 104 వాహనాల డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి. ఇప్పటికీ కొందరు డ్రైవర్లకు జాయినింగ్ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారు. నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వలేదు. ఉద్యోగ భద్రత కల్పించేలా కాంట్రాక్టు విధానంలోకి మార్చాలి. 104 వాహనాల ఫిట్‌నెస్ ఇన్సూరెన్స్ వెంటనే చేయించాలి.

–కిరణ్, జిల్లా 104 ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి

డైలీ రిపోర్టులు బంద్..

నిబంధనల ప్రకారం జిల్లాలో రోజూ వైద్య పరీక్షలు, మందుల పంపిణీ తదితర ఓపి వివరాలను ప్రత్యేకంగా డైలీ రిపోర్టులను జిల్లా వైద్య శాఖకు, అరబిందో సంస్థకు సిబ్బంది పంపించాల్సి ఉంది. తాజాగా పరిణామాలతో ఈ రిపోర్టులను ప్రభుత్వానికి పంపించకూడదని సిబ్బంది నిర్ణయించుకున్నారు. గురువారం నుంచి అధికారిక సమావేశాలకు వెళ్ల కూడదని, ఆదేశాలను కూడా పాటించకూడదని 104 సిబ్బంది నిర్ణయించుకున్నారు. అధికారిక వాట్సాప్‌ల నుంచి ఒక్కొక్కరుగా ఎగ్జిట్ అయ్యారు.

శానిటరీ మేస్త్రిలను..
విధుల్లోకి తీసుకోవాల్సిందే



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

- రెండో రోజూ కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె
- సమస్య పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని స్పష్టీకరణ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాజకీయ కక్షతో తొలగించిన శానిటరీ మేస్త్రిలను తిరిగి విధుల్లోకి తీసుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజు, అధ్యక్షుడు కె.వేణుగోపాల్‌రావు హెచ్చరించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ శానిటరీ మేస్త్రిలు, పారిశుద్ధ్య కార్మికులు రెండో రోజు గురువారం కూడా శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె కొనసాగించారు. తొలగింపునకు గురైన మోహన్‌కృష్ణ, అల్లు ఉపేంద్ర, పెసల రాములను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మేస్త్రిల సంఘం అధ్యక్షుడు ముద్దాడ రామారావు, అల్లు రవి, మున్సిపల్ యూనియన్ నాయకులు జె.గురుమూర్తి, ఎన్.పార్థసారధి, ఆర్.గణేష్, డి.రమణ, రసూల్, సోగ్గాడు, అర్జి గణేష్, సురేష్, తిరుమలరావు, సూర్యకళ, సీతమ్మ, అర్జి లక్ష్మి, సరస్వతి, అరుగుల రమణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డున పడేశారు



గత 7 ఏళ్లుగా శానిటరీ మేస్త్రీలుగా పనిచేస్తున్నాం. ఏ రోజూ చిన్న తప్పు కూడా చేయలేదు. కేవలం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా విధుల నుంచి తొలగించారు. దీంతో చిన్నపిల్లలతో కుటుంబాలతో రోడ్డుపడే పరిస్థితి తీసుకొచ్చారు. తప్పుచేసినట్లు రుజువు చేసి, ఏ చర్యలైనా తీసుకోవాలే తప్ప ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడం సరికాదు.

– పెసల రాము, శానిటేషన్ మేస్త్రి, చాపురం-2

రాజకీయ వేధింపులు సరికాదు



మా విధులను నిర్వహించడంలో భాగంగా ప్రజా ప్రతినిధులకు దగ్గరగా ఉంటాం. అంతేతప్ప రాజకీయాల కోసం కాదు. అధికారంలో ఉన్న పార్టీ నాయకులు ఎలా చెబితే అలా విని పనిచేయడమే మా బాధ్యత.

– అల్లు ఉపేంద్ర, శానిటేషన్ మేస్త్రీ చాపురం-1

చిరుద్యోగులపై ప్రతాపమా?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్పటి నుంచి మాలాంటి చిరుద్యోగులపై ప్రతాపాన్ని చూపిస్తున్నారు. స్థానిక నాయకులకు నచ్చడం లేదనే కారణంగా విధుల్లోంచి తొలగించమని కమిషనర్‌కి ఆదేశాలు ఇవ్వడం సరికాదు. నాయకులకు నచ్చలేదని ఉద్యోగం తీసేస్తారా?

– పెదలాపు మోహన్‌కృష్ణ, శానిటేషన్ మేస్త్రి, పాత్రునివలస

జోనల్ స్పోర్ట్స్‌మీట్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గురువారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ విద్యా సొసైటీ ఆధ్వర్యంలో బాలికల జోనల్‌స్థాయి స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడల్లో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల గురుకుల పాఠశాలల క్రీడాకారిణులు హాజరయ్యారు. సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల సొసైటీ అకడమిక్ జాయింట్ సెక్రటరీ ఎస్.సంజీవరావు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 21 పాఠశాల నుంచి 900 మంది క్రీడాకారిణులు పాల్గొనగా మొదటి రోజులు కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, ఖోఖో, 1500 మీటర్లు, 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పోటీల్లో బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అంబేడ్కర్ గురుకులాల కో ఆర్డినేటర్ బాలాజీ, జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, డీవీఈవో తవిటినాయుడు, ప్రిన్సిపాల్ ఎల్.పద్మజ, ఆర్ఐవో దుర్గారావు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని మహిళ మృతి



కోళ్ల రాజులమ్మ(ఫైల్)

నందిగాం: మండలంలోని మద్దిలివానిపేట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మద్దిలివానిపేటకు చెందిన కోళ్ల రాజులమ్మ(50) మృతి చెందింది. గురువారం ఎప్పటిలాగే టెక్కలిలోని జీడిపిక్కల ఫ్యాక్టరీలో పనిచేసేందుకు వెళ్లి తిరిగి బస్సులో గ్రామానికి చేరుకుంది. రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో రాజులమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనం కోసం ఆరా తీస్తున్నారు. మృతురాలి భర్త గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్సై షేక్ మహ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి

ఎచ్చెర్ల క్యాంపస్: కింతలిమిల్లు నుంచి చిలకపాలెం వైపు వెళ్లే బైపాస్ రోడ్డుపై జరజాం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి చెందాడు. పశ్చిమబెంగాల్ నుంచి విశాఖ వైపు కోడి గుడ్లతో వెళ్తున్న లారీ ముందు వెళుతున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో క్యాబిన్‌లో ఉన్న లారీ డ్రైవర్ నేపాల్ నంది(40) తీవ్ర గాయాల పాలై మృతి చెందాడని ఎస్సై వి.సందీప్‌కుమార్ తెలిపారు.



నింగీ నేల మాదే!

ఎటువంటి పొగ, మంట లేకుండా కేవలం గాలి, నీరు, ఒత్తిడితో రాకెట్ ప్రయోగం నిర్వహించి అదరహో అనిపించారు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు. ఇందుకు కోటబొమ్మాళి మండలం చిన్నబమ్మిడి జెడ్పీ హైస్కూల్ వేదికగా నిలిచింది. గురువారం బాలల దినోత్సవం పురస్కరించుకుని మెట్టవలస హైస్కూల్ భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు బొత్స వెంకటరావు గెస్ట్ టీచర్‌గా హాజరై విద్యార్థుల ముందు రాకెట్ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించారు. రాకెట్ ఆకాశంలోకి వెళ్లి తిరిగి కిందకు రావడాన్ని విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.భానుమూర్తి, ఉపాధ్యాయులు పి.గోపాలకృష్ణ, కె.పరశురాం, నీలామోహన్, సీతాప్రసన్న, శ్రీనివాసరావు, వి.రామారావు, ఆర్.త్రివేణి, చల్ల కేశవరావు పాల్గొన్నారు.

– కోటబొమ్మాళి

పారదర్శకంగా సహకార సేవలు



సహకార జెండాను ఆవిష్కరిస్తున్న జేసీ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం అర్బన్: సహకార వ్యవస్థలో చిన్న, సన్నకారు రైతులకు, పేదలకు ఉపయుక్తంగా సహకార సంఘాలు పారదర్శకంగా సేవలందించాలని జేసీ, డీసీసీబీ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. శ్రీకాకుళం డీసీసీబీ బ్యాంక్ కార్యాలయ ఆవరణలో గురువారం 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను జేసీ అహ్మద్‌ఖాన్ ఘనంగా ప్రారంభించి సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా సహకార అధికారి బి.నగేష్, డీసీసీబీ సీఈవో డి.వరప్రసాదరావు, నాబార్డు డీడీఎం కె.రమేష్ కృష్ణ, డీసీసీబీ జీఎం ఎస్‌వీఎస్ జగదీష్, శ్రీకాకుళం డివిజనల్ సహకార అధికారి బి.మురళీకృష్ణ, టెక్కలి డివిజన్ సహకార అధికారి కె.మురళీకృష్ణ, బ్యాంక్ డీజీఎంలు, ఏజీఎంలు, ఛీఫ్ మేనేజర్లు, మేనేజర్లు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

20న సామగ్రి వేలం

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ పాత సామగ్రిని ఈ నెల 20న ఆమదాలవలస కో– ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ గోదాం వద్ద వేలం వేయనున్నట్లు డిపో మేనేజర్ ఇన్‌చార్జి సీహెచ్ తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాత ఫ్రిజ్‌లు, ఇన్వర్టర్లు, బ్యాటరీలు, క్యాష్ చెస్టులు, స్కానర్లు, క్యాస్ కౌంటర్ మిషన్లు వేలం వేస్తామని పేర్కొన్నారు. ఎచ్చెర్ల బేవరేజెస్ కార్పొరేషన్ కార్యాలయంలో 19న డిపాజిట్ చెల్లించిన వారు వేలంలో పాల్గొనేందుకు అర్హులని, వివరాలకు 9177771599 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పేకాట శిబిరంపై దాడులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పాల్లాడ జీడి తోటల్లో జరుగుతున్న పేకాట శిబిరంపై వజ్రపుకొత్తూరు పోలీసులు దాడులు నిర్వహించారు. నలుగురిని అదుపులోకి తీసుకుని బైక్, రూ.7వేలు నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.నిహార్ గురువారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు మీద రోడ్డు.. మనకెవరు అడ్డు!



రామేశ్వరంలో సీసీ రోడ్డుపై మరలా వేసిన సీసీ రోడ్డు



గతంలో బాగానే ఉన్న సీసీ రోడ్డు

టెక్కలి: కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనుల్లో పక్షపాతం చూపడమే కాకుండా నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. టెక్కలి మండలం బూరగాం పంచాయతీ రామేశ్వరంలో టీడీపీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ పథకం నిధులు రూ.3.20 లక్షలతో సిమెంట్ రోడ్ వేశారు. అయితే గతంలో బాగున్న రోడ్డుపైనే మళ్లీ సిమెంట్ రోడ్డు వేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్ల ముంగిట రోడ్డు వేయకుండా పక్షపాతం చూపారు. ఈ అడ్డగోలు పనులకు మండల స్థాయి ఇంజినీరింగ్ అధికారులు సైతం తోడుగా నిలవడం గమనార్హం. ముందుగా.. జనపాన తేజ ఇంటి నుంచి చల్లా చిలకమ్మ ఇంటి వరకు రోడ్డు వేసేందుకు ప్రతిపాదనలు చేశారు. పనులు మాత్రం కేవలం టీడీపీ కార్యకర్తలు ఇళ్లు ఉన్నంత వరకు మాత్రమే చేపట్టి.. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్లకు రోడ్డు వేయకుండా వదిలేశారు. ఈ అడ్డగోలు పనులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు స్థానికులు సిద్ధమవుతున్నారు.

విద్యుత్ చార్జీల పెంపు వెనక్కితీసుకోవాలి



ఎచ్చెర్లలో ప్రజా పోరు ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల: సర్దుబాటు పేరిట విద్యుత్ చార్జీలు పెంచడం సరికాదని, తక్షణమే ప్రభుత్వం చార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎచ్చెర్లలో గురువారం ప్రజాపోరు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పంపుసెట్లకు ఏర్పాటు చేసిన స్మార్ట్‌మీటర్లు తొలగించాలని కోరారు. పెరిగిన నిత్యావసర ధరలు నియంత్రించాలని డిమాండ్ చేశారు. సాధారణ ప్రజలు బతకలేని పరిస్థితి నెలకొందన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బంగార్రాజు, రామారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.